PRGI NO:TGTEL/26/A0383

డైనమిక్

జనం వాయిస్

తెలుగు దినపత్రిక

WWW.JANAMVOICE.COM

తెలంగాణ శనివారం 17-10-2026 సంపుటి: 01 సంచిక : 280 పేజీలు : 12



ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందన్న కవిత.
రేవంత్ పాలన పక్కన పెట్టేశారని విమర్శ.
రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉంటామని వెల్లడి.



రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ.
పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ.
2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య.

2

ధరల మంటలో సామాన్యుడి

బతుకు బుగ్గి!

పండుగ వేళ నిత్యావసరాల ధరలతో జనం విలవిల!.

- బియ్యం, పప్పులు, కూరగాయల ధరలతో బెంబేలెత్తుతున్న ప్రజలు.
- నెలవారీ కుటుంబ బడ్జెట్‌పై అదనంగా రూ.2,500 భారం.
- ఆర్టీసీ ప్రత్యేక బస్సుల అదనపు ఛార్జీలతో ప్రయాణికులపై మోత.
- ధరలను నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరుతున్న వినియోగదారులు.



జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 16:

పండుగ వచ్చిందంటే ఇంటిల్లిపాదీ ఆనందంగా గడపాల్సిన వేళ.. నిత్యావసరాల ధరలు సామాన్యుడి గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. మార్కెట్‌కు వెళ్లాలంటేనే మధ్యతరగతి కుటుంబాలు జంకుతున్నాయి. బియ్యం కొనాలన్నా భారం.. పప్పులు కొనాలన్నా భారం.. కూరగాయలు కొందామంటే జేబులు ఖాళీ అవుతున్న పరిస్థితి నెలకొంది. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో పెరిగిన ఖర్చులతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ దిగుబడుల తగ్గుదల, సరఫరాలో అంతరాయాలు ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పండుగ ప్రయాణాల కోసం ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ప్రజల ఆందోళనను మరింత పెంచుతున్నాయి. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం గత నెలలో హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.65 పలికిన హెచ్‌ఎంటీ జైశ్రీరాం బియ్యం ధర ప్రస్తుతం రూ.95కు చేరినట్లు తెలుస్తోంది. రూ.45 ఉన్న సోనామసూరి బియ్యం రూ.70కు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. సెప్టెంబరులో కిలో రూ.76 ఉన్న శనగపప్పు రూ.96కు, రూ.96 ఉన్న పెసరపప్పు రూ.110కు చేరినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. బియ్యం, పప్పుధాన్యాలతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగడంతో సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఒకప్పుడు నెలకు నిత్యావసరాలు, కూరగాయల కోసం రూ.9,500 ఖర్చు చేసిన కుటుంబానికి ప్రస్తుతం రూ.12 వేలకుపైగా ఖర్చవుతోందని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం రోజురోజుకూ పెరుగుతుండటంతో కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పాటు ఎలక్ట్రానిక్ - మిగతా 2 లో...



2

ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర

బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్
అభిజీత్ దీప్కే, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు.
విదేశీ శక్తులతో దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారన్న నితిన్ నబీన్.
ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజా తీర్పుతో వస్తుందని వ్యాఖ్య.



2

ఒకే ఊరు.. ఒకే లక్ష్యం.. కలిసి చదివి పోలీస్ కొలువులు కొట్టిన ఐదుగురు మిత్రులు!

యూపీలో ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు మిత్రులు పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపిక.
ఎలాంటి కోచింగ్ లేకుండా కలిసికట్టుగా చదువుకుని విజయం సాధించిన వైనం.



2

విమాన ప్రయాణికులకు ఊరట.

ఛార్జీల నియంత్రణపై కేంద్రం కీలక ముందడుగు.
భారతీయ వాయుయాన్ అధినియమ్ కింద నిబంధనలకు ఆమోదం.
రెండు వారాల్లో రూల్స్ ప్రచురిస్తామని సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం.
విమాన ఛార్జీల నియంత్రణ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ.
పండుగల వేళ ఛార్జీల పెంపుపై గతంలో సుప్రీంకోర్టు ఆందోళన.
నవంబర్ 16కు తదుపరి విచారణ వాయిదా వేసిన ధర్మాసనం.

భాగ్యనగరానికి పాడ్ టాక్సీలు!

హైదరాబాద్‌లో సరికొత్త రవాణా వ్యవస్థకు సర్కారు ప్రణాళిక.
ఐటీ కారిడార్‌లో మూడు మార్గాలకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్.
ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థ.
కిలోమీటరుకు రూ.120 కోట్ల నుంచి రూ.180 కోట్ల వ్యయ అంచనా.
ప్రయాణికుల భద్రతకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశం.



2

జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 16:

విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో వినూత్న రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని తగ్గించి ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మెట్రో రైలు, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సేవలకు అదనంగా పాడ్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు - మిగతా 2 లో...

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.

1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్.
తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ.
1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య.



2

యాసంగి సాగుపై అన్నదాతల్లో ఆందోళన!

నీటి కొరత, విద్యుత్ కోతల భయంతో సాగుకు వెనకడుగు.
ఎకరానికి రూ.20 వేల పరిహారం ఇవ్వాలని రైతు సంఘాల డిమాండ్.
పగటిపూట 9 గంటల విద్యుత్ సరఫరాకు హామీ ఇవ్వాలని వినతి.
వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపైనా వర్షాభావ ప్రభావం.
ప్రభుత్వ భరోసా లేకుంటే సాగుకు దూరమయ్యే పరిస్థితి!.

2

దైనిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM
PRGI NO:TGTEL/26/A0383

ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర

జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 16:

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (AISA) అధ్యక్షురాలు నేహా బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఎలక్టోరల్ రోల్స్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన ర్యాలీకి కొద్దిసేపటి ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో నిరసన చేపట్టాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అయితే, ఈ ర్యాలీకి మున్సిపల్ కౌన్సిల్ నుంచి అనుమతి లేదని, ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 అమల్లో ఉందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే ర్యాలీకి ముందు అభిజీత్ దీప్కేను, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ అరెస్టులు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ప్రతిపక్షాలు విదేశీ శక్తులతో కలిసి 'ప్రభుత్వాన్ని మార్చే కుట్ర' (రెజీమ్ ఛేంజ్) పన్నుతున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'రెజీమ్ ఛేంజ్' వంటి పదాల వాడకంతో ప్రతిపక్షాల అసలు ఎజెండా దేశం ముందు బయటపడిందని.. విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని అస్థిరపరిచేందుకు అర్బన్ నక్సల్స్ పన్నిన పన్నాగం ఇది అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల తీర్పుతో వస్తుంది కానీ, అరాచకంతో కాదు అని ఆయన హితవు పలికారు. నేతల అరెస్టులు జరిగినప్పటికీ, సుమారు 200 నుంచి 300 మంది నిరసనకారులు కన్నాట్ ప్లేస్‌కు చేరుకుని తమ నిరసనను కొనసాగించారు.

ఒకే ఊరు.. ఒకే లక్ష్యం.. కలిసి చదివి పోలీస్ కొలువులు కొట్టిన ఐదుగురు మిత్రులు!

జనం వాయిస్, ఉత్తరప్రదేశ్, అక్టోబర్ 16:

స్నేహం, పట్టుదల, పరస్పర సహకారం ఉంటే అసాధ్యాలను కూడా సుసాధ్యం చేయవచ్చని నిరూపించారు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు మిత్రులు. ఒకే గ్రామానికి చెందిన ఈ స్నేహితుల బృందం, ఎలాంటి కోచింగ్ లేకుండా కలిసికట్టుగా చదువుకుని, ఒకేసారి ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికై అందరికీ ఆదర్శంగా నిలిచింది. వీరి స్ఫూర్తిదాయక ప్రయాణం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లా, దుబౌలియా బ్లాక్ పరిధిలోని నందేకువాన్ అనే చిన్న గ్రామానికి చెందిన అంకేష్ సత్యం దూబే, ఆదర్శ్ ద్వివేది, దీపక్ దూబే, ఆదిత్యనాథ్ దూబే (ఉత్కర్ష్), రోహిత్ ప్రజాపతి చిన్ననాటి నుంచి స్నేహితులు. వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసినా, ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనే వారి లక్ష్యం మాత్రం ఒక్కటే. అయితే, ఉన్నత స్థాయి కోచింగ్ తీసుకునేంత ఆర్థిక స్తోమత వారికి లేదు. అయినప్పటికీ, వారు నిరాశ చెందలేదు. తమ కలలను సాకారం చేసుకునేందుకు ఒకరికొకరు తోడుగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు, వారిలో కొందరు చదువుతో పాటు చిన్న ఉద్యోగాలు కూడా చేశారు. అంకేష్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తన చదువు ఖర్చులను సమకూర్చుకోగా, ఆదర్శ్ సాయంత్రం వేళల్లో పిల్లలకు ట్యూషన్లు చెబుతూ సంపాదించేవాడు. మిగిలిన మిత్రులు కూడా తమ వంతుగా కృషి చేశారు. ప్రతిరోజూ సాయంత్రం అందరూ ఒకచోట చేరి, మొబైల్ ఫోన్ల సహాయంతో చదువుకునేవారు. నోట్స్ పంచుకోవడం, కష్టమైన అంశాలపై చర్చించుకోవడం, ఒకరి బలహీనతలను మరొకరు సరిదిద్దుకోవడం వంటివి వారి దినచర్యలో భాగమయ్యాయి. ఈ మిత్రబృందం పడిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది. ఇటీవల విడుదలైన యూపీ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఐదుగురూ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో కొందరు గతంలో రెవెన్యూ లేఖ్‌పాల్, ఎస్ఎస్‌సీ జీడీ వంటి ఇతర పోటీ పరీక్షల్లో కూడా ఉత్తీర్ణత సాధించడం వారి పట్టుదలకు నిదర్శనం. ఐదుగురు స్నేహితులు ఒకేసారి ప్రభుత్వ కొలువులు సాధించడంతో వారి కుటుంబాల్లోనే కాదు, యావత్ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తమ పిల్లల విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, స్నేహితుల మధ్య ఉన్న బలమైన బంధమే కారణమని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి వసతులు లేని గ్రామీణ ప్రాంతంలో పుట్టి, కోచింగ్‌కు వెళ్లకుండానే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ద్వారా ఈ ఐదుగురు మిత్రులు ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలిచారు. కఠోర శ్రమ, దృఢ సంకల్పం ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని వారి విజయం చాటి చెబుతోంది.

ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 16:

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 16:



కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు''గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది'' అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు'' అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ధరల మంటలో సామాన్యుడి బతుకు బుగ్గి!

- మొదటి పేజీ తరువాయి..



వస్తువుల ధరలు కూడా వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. ముడిపదార్థాలు, మెమరీ చిప్‌ల ధరల పెరుగుదల ప్రభావంతో స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఏసీల ధరలు పెరిగినట్లు మార్కెట్ నివేదికలు సూచిస్తున్నాయి. డిజిటల్‌స్టాక్ పేరిట పేర్కొన్న గణాంకాల ప్రకారం ఆన్‌లైన్ మార్కెట్‌లో ల్యాప్‌టాప్‌ల సగటు ధరలు 32 శాతం, ఏసీల ధరలు 11 శాతం, స్మార్ట్‌ఫోన్ల ధరలు 7 శాతం పెరిగినట్లు సమాచారం. దీంతో పండుగ సందర్భంగా కొత్త వస్తువులు కొనుగోలు చేయాలనుకున్న కుటుంబాలు వెనకడుగు వేస్తున్నాయి. ఇక పండుగకు సొంతూళ్లకు వెళ్లాలనుకునే ప్రయాణికులకు రవాణా ఖర్చులు మరో భారంగా మారాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సుల పేరుతో సాధారణ ఛార్జీలపై 50 శాతం వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుటుంబ సభ్యులందరూ కలిసి ప్రయాణించాలంటే వందల రూపాయల అదనపు భారం పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ రోజుల్లో ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచాల్సిన ప్రభుత్వం అదనపు ఛార్జీల భారాన్ని తగ్గించాలని కోరుతున్నారు. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల దిగుబడులు తగ్గితే రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. సరఫరా పరిస్థితులు మెరుగుపడకపోతే రానున్న 15 నుంచి 20 రోజుల్లో కొన్ని ఆహారధాన్యాల ధరలు మరో 10 నుంచి 20 శాతం వరకు పెరిగే ప్రమాదముందని అభిప్రాయపడుతున్నాయి. ధరల పెరుగుదలతో వినియోగదారుల కొనుగోలు శక్తి తగ్గడం చిన్న వ్యాపారులపైనా ప్రభావం చూపుతోంది. పండుగ సీజన్‌లో ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగడం లేదని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. మార్కెట్లలో ధరలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల నుంచి వినియోగదారుల వరకు సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేసి ధరలను అదుపులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పండుగల వేళ ఆనందంగా గడపాల్సిన కుటుంబాలు ఖర్చుల లెక్కలు వేసుకుంటూ ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరల మంట నుంచి సామాన్యుడికి ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

భాగ్యనగరానికి పాడ్ ట్యాక్సీలు!

- మొదటి పేజీ తరువాయి..

లీ అసోసియేట్స్ సంస్థ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రతిపాదిత నాలుగు కారిడార్లలో ఐటీ కారిడార్ పరిధిలోని మూడు మార్గాలకు సీఎం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు సమాచారం. నగరంలోని ప్రధాన ఐటీ కేంద్రాలను అనుసంధానించేలా రాయదుర్గం నుంచి కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ నుంచి రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, కొండాపూర్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు మూడు పీఆర్‌టీ కారిడార్లను ప్రతిపాదించారు. ఈ మార్గాల్లో నిత్యం వేలాది మంది ఐటీ ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మూడు కారిడార్లకు సంబంధించి ఒక్కో మార్గానికి మూడు చొప్పున ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత ఏజెన్సీని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రయాణికులకు ఎక్కువ ప్రయోజనం చేకూరే మార్గాలను గుర్తించి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. మరోవైపు అసెంబ్లీ, లక్డీకాపూల్, సచివాలయం, ట్యాంక్‌బండ్ ప్రాంతాలను అనుసంధానించేలా నాలుగో కారిడార్‌ను ప్రతిపాదించారు. అయితే ఈ మార్గంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో మరింత లోతుగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ కారిడార్‌ను రాణిగంజ్ వరకు పొడిగించే సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని కీలక ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచే దిశగా ఈ ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. పాడ్ ట్యాక్సీ వ్యవస్థ నిర్మాణానికి కిలోమీటరుకు సుమారు రూ.120 కోట్ల నుంచి రూ.180 కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. భారీ వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో ఆదాయం కంటే ప్రయాణికుల భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చిన్న వాహనాల ద్వారా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు వేగంగా చేర్చే విధంగా పీఆర్‌టీ వ్యవస్థను రూపొందించనున్నారు. ప్రాజెక్టు అమల్లోకి వస్తే ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ కొంతమేర తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టులపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. పాతబస్తీతో సహా నగరంలోని నాలుగు మెట్రో కారిడార్లకు సంబంధించిన జనరల్ కన్సల్టెన్సీ టెండర్ల గడువును హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు అధికారులు మరోసారి పొడిగించారు. తొలుత అక్టోబర్ 8 వరకు నిర్ణయించిన గడువులో తగిన స్పందన రాకపోవడంతో అక్టోబర్ 22 వరకు పొడిగించినట్లు సమాచారం. మెట్రో విస్తరణతో పాటు పీఆర్‌టీ వ్యవస్థను



కూడా అభివృద్ధి చేస్తే నగర ప్రజలకు మరిన్ని రవాణా అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న ఉద్యోగులకు పాడ్ ట్యాక్సీ వ్యవస్థ ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు, సాధ్యాసాధ్యాల పరిశీలన దశలోనే ఉండటంతో తుది మార్గాలు, నిర్మాణ వ్యయం, పనుల ప్రారంభంపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. పీఆర్‌టీ వ్యవస్థ, మెట్రో విస్తరణ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే భాగ్యనగర ప్రజా రవాణాలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.

జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 16:

తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.



1,000 టీఎంసీల నీరు వృథా చేశారంటూ..

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు చర్యలు లేవు

ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించుకెళ్లిందని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సొరంగం ద్వారా కృష్ణా జలాలను వినియోగించుకుందని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని అందించిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యల సారాంశం. అయితే, నీటి విడుదలకు సంబంధించిన గణాంకాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేసిన ఆరోపణలు కేటీఆర్ వెల్లడించినవే.

విమాన ప్రయాణికులకు ఊరట.

జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 16:



దేశంలో విమాన ఛార్జీల నియంత్రణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. భారత విమానయాన రంగాన్ని క్రమబద్ధీకరించేందుకు తీసుకువచ్చిన "భారతీయ వాయుయాన్ అధినియమ్-2024'' చట్టం కింద రూపొందించిన నిబంధనలకు పరిపాలనాపరమైన ఆమోదం లభించిందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. రాబోయే రెండు వారాల్లో ఈ నిబంధనలను నోటిఫై చేసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. శుక్రవారం జరిగిన విచారణలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనానికి ఈ వివరాలను వెల్లడించారు. నిబంధనలను ఇప్పటికే ఖరారు చేసినట్లు ఆయన కోర్టుకు వివరించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, నోటిఫై చేసిన నిబంధనల ప్రతిని తమ ముందు ఉంచాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను నవంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది. విమానయాన రంగంలో పారదర్శకతను పెంచడంతో పాటు ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు స్వతంత్ర నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఎస్. లక్ష్మీనారాయణన్ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ప్రైవేట్ విమానయాన సంస్థలు టికెట్ ధరలను, అనుబంధ ఛార్జీలను ఇష్టానుసారంగా పెంచకుండా నియంత్రించేందుకు పటిష్ఠమైన మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు. బ్రిటిష్ కాలం నాటి 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్-1934' స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఈ "భారతీయ వాయుయాన్ అధినియమ్-2024''ను తీసుకువచ్చింది. విమానాల డిజైన్, తయారీ, నిర్వహణ, వినియోగం, అమ్మకాలు, ఎగుమతి, దిగుమతి వంటి అన్ని కీలక అంశాలను పర్యవేక్షించేందుకు ఈ చట్టం ఒక ఆధునిక చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కల్పిస్తుంది. ఈ ముసాయిదాను సుప్రీంకోర్టుకు కేంద్రం ఇటీవలే అందించింది. గతంలో జరిగిన విచారణల సందర్భంగా, ముఖ్యంగా పండుగలు, సెలవు దినాల్లో విమాన ఛార్జీలు అమాంతం పెరగడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే కొత్త చట్టం కింద నిబంధనల రూపకల్పనను వేగవంతం చేస్తున్నామని కేంద్రం కోర్టుకు హామీ ఇచ్చింది. తాజా పరిణామాలతో అస్థిరమైన విమాన ఛార్జీల సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రయాణికులు ఆశిస్తున్నారు.

యాసంగి సాగుపై అన్నదాతల్లో ఆందోళన!

జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 16:

రాష్ట్రంలో రాబోయే యాసంగి సాగు రైతులకు సవాల్‌గా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరత, విద్యుత్ సరఫరాపై నెలకొన్న అనిశ్చితి అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టి ఆశించిన దిగుబడులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు మరోసారి సాగుకు సిద్ధమవ్వాలంటే ప్రభుత్వం నుంచి స్పష్టమైన భరోసా కావాలని కోరుతున్నారు. ముఖ్యంగా పంటల సాగుకు అవసరమైన నీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూస్తామని హామీ ఇస్తేనే ముందుకు వస్తామని, లేదంటే అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపైనా ప్రభావం చూపుతున్నాయని రైతు వర్గాలు పేర్కొంటున్నాయి. పంటల దిగుబడులు తగ్గడం, పశుగ్రాసం కొరత ఏర్పడటం, పశువుల పోషణ ఖర్చులు పెరగడం వంటి సమస్యలు గ్రామీణ కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పశువులకు సరిపడా దాణా అందకపోవడంతో పాల ఉత్పత్తిపైనా ప్రభావం పడుతోందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోవడం, మరోవైపు కుటుంబ నిర్వహణ ఖర్చులు పెరుగుతుండటంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పంట నష్టాలను క్షేత్రస్థాయిలో అంచనా వేసి బాధిత రైతులకు ఎకరానికి రూ.20 వేల చొప్పున పరిహారం అందించాలని కోరుతున్నాయి. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇప్పటికే అప్పుల భారంతో సతమతమవుతున్న రైతులకు మరో పంట సాగు కోసం పెట్టుబడి సమకూర్చుకోవడం కష్టంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా యాసంగి సీజన్‌లో వ్యవసాయానికి పగటిపూట తొమ్మిది గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ కోతలు లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, సాగునీటి లభ్యతపై స్పష్టమైన సమాచారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. సాగు ప్రారంభించిన తర్వాత నీరు, విద్యుత్ అందకపోతే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని రైతు సంఘాలు హెచ్చరిస్తున్నాయి. నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ సాగు విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముఖ్యంగా బిందు సేద్యం వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులకు ప్రోత్సాహం అందించాలని సూచిస్తున్నాయి. తక్కువ నీటితో సాగయ్యే పంటలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని కోరుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు క్షేత్రస్థాయిలో మార్గదర్శకత్వం అందిస్తే నష్టాలను కొంతవరకు తగ్గించే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి. రాబోయే యాసంగి సీజన్ రైతులకు మరింత భారంగా మారకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పంట నష్టపరిహారం, విద్యుత్ సరఫరా, సాగునీటి నిర్వహణ, పెట్టుబడి సహాయం వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలిస్తేనే సాగుపై విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నాయి. రైతుల ఆందోళనలను తొలగించి వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఇప్పుడు కీలకంగా మారింది.

PRGI NO:TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

చింతచెట్టు నీడలో దసరా కథ..!

◆ అనగనగా ఒక పల్లెటూరు!
◆ పల్లె పరిమళం.. మన బంధాల బంగారు జ్ఞాపకం.

(బేతమళ్ళ సహదేవ్ జిల్లా బ్యూరో కథనం)
జనం వాయిస్ / మహబూబాబాద్ :

"అనగనగా ఒక పల్లెటూరు.. ఆ ఊరిలో ఒక పెద్ద చింతచెట్టు.. ఆ చింతచెట్టు కింద ఓ ముసలయ్య.. ఆయన చుట్టూ మనుమలు, మనుమరాళ్లు.. అప్పుడు మొదలైంది పల్లె దసరా ముచ్చట!"

.., ఊరి చివరన ఉన్న ఆ పాత చింతచెట్టు కింద సాయంత్రం వేళ చల్లని గాలి వీస్తోంది. పిట్టలు గూళ్లకు చేరుకుంటున్నాయి. పొలాల నుంచి రైతులు ఇంటిదారి పడుతున్నారు. చెట్టు కింద కూర్చున్న తాత చుట్టూ మనుమలు, మనుమరాళ్లు చేరారు.

"తాతయ్యా.. తాతయ్యా.. మా ఊర్లో దసరా పండుగ ఇంత సందడిగా ఎందుకు ఉంటుంది? పట్టణంలో ఉండే వాళ్లంతా పండుగకే ఎందుకు ఊరికి వస్తారు?" అని ఓ మనవడు అమాయకంగా అడిగాడు.

తాత చిరునవ్వు నవ్వి, తన తెల్లని మీసం సవరించుకుంటూ కథ మొదలుపెట్టాడు.

..."అనగనగా ఒక కాలం ఉండేది నాయనా.. అప్పట్లో ఈ పల్లెలే మనుషుల జీవితాలకు అసలైన ఆనందాల పుట్టిళ్లు. పెద్ద పెద్ద భవనాలు లేకపోయినా, ఖరీదైన కార్లు లేకపోయినా, ప్రతి ఇంట్లో ప్రేమ ఉండేది. ప్రతి మనిషి పలకరింపులో ఆప్యాయత ఉండేది. ఎవరి ఇంట్లో పండుగ జరిగినా ఊరంతా తమ ఇంట్లోనే జరుగుతున్నట్టుగా సంబరపడేవారు.


దసరా వచ్చిందంటే చాలు.. పల్లెకు కొత్త కళ వచ్చేది. పొలం పనులు చేసుకునే రైతన్నలు పండుగకు సిద్ధమయ్యేవారు. ఆడబిడ్డలు పుట్టింటికి వచ్చేవారు. అల్లుళ్లు అత్తవారింటికి చేరేవారు. దూర ప్రాంతాల్లో చదువుకునే పిల్లలు, పట్టణాల్లో ఉద్యోగాలు చేసే యువకులు, యువతులు అందరూ తమ సొంతూళ్లకు బయలుదేరేవారు.

బస్సులు కిక్కిరిసిపోయేవి.. రైళ్లలో రద్దీ పెరిగేది.. కానీ అందరి మనసుల్లో మాత్రం ఒకటే ఆనందం --- 'మన ఊరికి వెళ్తున్నాం.. మన వాళ్లను చూడబోతున్నాం!' అని."

"తాతయ్యా.. పట్టణాల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయి కదా! మరి ఈ ఊరికి రావడంలో అంత ఆనందం ఏముంది?" అని మనుమరాలు అడిగింది.

తాత చింతచెట్టు కొమ్మల వైపు చూస్తూ ఇలా చెప్పాడు.

"బంగారూ.. పట్టణాల్లో వెలుగులు ఉండొచ్చు. పెద్ద



పెద్ద భవనాలు ఉండొచ్చు. కానీ మనసుకు హాయినిచ్చే అనుబంధాలు ఎక్కడ దొరుకుతాయో తెలుసా? మనల్ని పేరుపెట్టి పిలిచే మనుషుల మధ్య.. మన చిన్ననాటి జ్ఞాపకాలు దాచుకున్న మన ఊరిలో!

ఈ చింతచెట్టు కింద మీరు ఇప్పుడు కూర్చున్నట్టే, ఒకప్పుడు మీ నాన్నలు, అమ్మలు కూడా ఆడుకునేవారు. ఇదే చెట్టు కింద మీ ముత్తాతలు కూర్చొని ఊరి కబుర్లు చెప్పుకునేవారు. ఈ మట్టి మీదే మన కుటుంబాల జ్ఞాపకాలు పెరిగాయి. అందుకే మనిషి ఎక్కడికి వెళ్లినా తన మూలాలను మర్చిపోలేడు."

పిల్లలంతా ఆసక్తిగా వింటున్నారు.
తాత మళ్లీ కథ కొనసాగించాడు.

"దసరా రోజు ఉదయాన్నే ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసేవారు. పిల్లలు కొత్త బట్టలు వేసుకుని వీధుల్లో తిరిగేవారు. పెద్దలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకునేవారు. బంధువులంతా ఒకచోట చేరి భోజనాలు చేసేవారు. ఎవరింట్లో ఏ వంటకం చేసినా పక్కింటివారికి పంచేవారు.

ఒకరి సంతోషం అందరిదీ.. ఒకరి కష్టం ఊరందరిదీ. అదే అప్పటి పల్లె జీవితం!"

"మరి తాతయ్యా.. ఇప్పుడు కూడా అలా ఉంటుందా?" అని ఇంకో మనవరాలు అడిగింది.

తాత కాసేపు మౌనంగా ఉండి, నెమ్మదిగా చెప్పాడు.

"కాలం మారింది తల్లీ.. మనుషుల జీవితం మారింది. చదువుల కోసం, ఉద్యోగాల కోసం పిల్లలు పల్లెలు వదిలి పట్టణాలకు వెళ్లారు. అక్కడ పనుల ఒత్తిడి, సమయాభావం, యాంత్రిక జీవితం వాళ్లను బిజీగా మార్చేశాయి. ఒకే ఇంట్లో ఉన్నవాళ్లకు కూడా మనసు విప్పి మాట్లాడుకునే సమయం తగ్గిపోయింది.

కానీ దసరా లాంటి పండుగలు వచ్చినప్పుడు మాత్రం ఆ పరుగులన్నీ పక్కనపెట్టి, మళ్లీ తమ ఊరి బాట పడుతున్నారు. అమ్మ ఒడిలో కాసేపు సేదతీరాలని.. నాన్నతో నాలుగు మాటలు మాట్లాడాలని.. అమ్మమ్మ, నానమ్మల చేతి వంట తినాలని.. చిన్ననాటి స్నేహితులను కలవాలని వస్తున్నారు. అందుకే పండుగ వేళ పల్లెకు మళ్లీ ప్రాణం వచ్చినట్టవుతుంది!"

పిల్లల కళ్లలో ఆనందం మెరిసింది.

"తాతయ్యా.. అయితే పల్లెటూరే గొప్పదా? పట్టణాలు గొప్పవి కావా?" అని ఓ చిన్నారి ప్రశ్నించింది.

తాత నవ్వుతూ ఆమె తల నిమిరాడు.

"రెండూ అవసరమే బంగారూ! పట్టణాలు మనకు ఉపాధిని, అవకాశాలను ఇస్తాయి. పల్లెలు మనకు మూలాలను, అనుబంధాలను గుర్తుచేస్తాయి. ఒకటి మన జీవితానికి దారి చూపిస్తే, మరొకటి మనం ఎక్కడి నుంచి వచ్చామో చెబుతుంది.

కానీ ఒక విషయం మాత్రం గుర్తుంచుకోండి. ఎంత పెద్ద ఉద్యోగం చేసినా, ఎంత సంపాదించినా, మనల్ని ప్రేమించే మనుషులను మర్చిపోకూడదు. పండుగలకు ఊరికి రావాలి. పెద్దలతో గడపాలి. పిల్లలకు మన సంప్రదాయాలు నేర్పాలి. మన పల్లెల్లోని ఆప్యాయతను తరువాతి తరాలకు అందించాలి."

అప్పటికే చీకటి పడుతోంది. దూరంగా గుడి గంట మోగింది. ఇళ్లలో దీపాలు వెలిగాయి. పిల్లల తల్లి వచ్చి, "రండి.. ఇంటికి వెళ్దాం. భోజనం సిద్ధమైంది!" అని పిలిచింది.

కానీ పిల్లలు మాత్రం తాత చేతిని పట్టుకుని మరో ప్రశ్న వేశారు.

"తాతయ్యా.. వచ్చే దసరాకు కూడా ఇలాగే కథ చెబుతావా?"

తాత కళ్లలో ఆనందం మెరిసింది.

"తప్పకుండా చెబుతాను నాయనా! కానీ అప్పటికి మీరు కూడా ఒక మంచి కథ నేర్చుకోవాలి. మన పల్లె గురించి.. మన సంస్కృతి గురించి.. మనుషుల మధ్య ప్రేమ గురించి!" అంటూ మనుమలందరినీ దగ్గరకు తీసుకున్నాడు.

చింతచెట్టు ఆకుల మధ్య నుంచి వీచిన చల్లని గాలి ఆ కుటుంబ ఆప్యాయతకు సాక్షిగా నిలిచింది.

కథలోని నీతి :
పండుగ అంటే కొత్త బట్టలు ధరించడం కాదు.. పాత బంధాలను కొత్తగా పలకరించడం. పండుగ అంటే విందులు చేసుకోవడం మాత్రమే కాదు.. మనసులను పంచుకోవడం. పట్టణాల్లో ఎన్ని సౌకర్యాలు ఉన్నా, పల్లెల్లోని ఆప్యాయతకు ప్రత్యేకమైన విలువ ఉంటుంది. మన మూలాలను మర్చిపోకుండా, పెద్దలను గౌరవిస్తూ, పిల్లలకు మన సంప్రదాయాలను అందిస్తూ సాగినప్పుడే పల్లె సంస్కృతి తరతరాలకు జీవిస్తుంది. దసరా పండుగలో పల్లె సంబరం.. చింతచెట్టు నీడలో తాత చెప్పిన కథలా.. ప్రతి మనసులోనూ మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోవాలి!

సింగరేణి కార్మికులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి.

కార్మికుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు.
పదేళ్ల బీఆర్ఎస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే విమర్శలు.
రామగుండాన్ని బొందలగడ్డగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దే.
రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ధ్వజం.

జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 16:

సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా,



ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కార్మికులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, కార్మికులకు 34 శాతం లాభాల వాటా అందించడంతో పాటు మారుపేర్ల సమస్య పరిష్కారం, సొంతింటి కల సాకారం కోసం కృషి చేస్తోందని తెలిపారు. డిస్మిస్ అయిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే దిశగా చర్యలు చేపడుతున్నామని, కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో విజిలెన్స్ కేసుల పేరుతో కార్మికులను వేధించారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలను పరిష్కరించని కేటీఆర్ ఇప్పుడు వారిపై ప్రేమ ఒలకబోయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రామగుండం ప్రాంత ప్రజల కష్టార్జితంతో సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాలను అభివృద్ధి చేసుకొని, రామగుండాన్ని మాత్రం నిర్లక్ష్యం చేసి బొందలగడ్డగా మార్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బెల్లంపల్లి, మంచిర్యాల, శ్రీరాంపూర్ ప్రాంతాల నుంచి ప్రజలను తీసుకొచ్చి రామగుండంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే అవకాశం కల్పించినందుకు కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన కాసోజు శ్రీకాంతాచారిని గుర్తించని కేటీఆర్‌కు గోదావరిఖని బిడ్డ, ప్యారడైజ్ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాత్రం గుర్తుకొచ్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారుడు గద్దర్ అంత్యక్రియలకు కూడా హాజరుకాలేదని ఆరోపించారు. ఉద్యమకారుల త్యాగాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారి కుటుంబాల భవిష్యత్తుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్మికులకు వాస్తవాలు తెలుసునని, సరైన సమయంలో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వల్మిడి సీతారామచంద్రస్వామి దేవస్థానానికి రూ.2 లక్షల విలువైన శతగోపం బహుకరణ.

స్వామివారి సేవలో భాగంగా వెండి శఠారి బహుకరించిన వనం ఫణిరాజకుమారి.

అక్టోబర్ 16 జనం వాయిస్ పాలకుర్తి

పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానానికి భక్తులు సుమారు రూ. 2 లక్షల విలువైన శతగోపాలను బహుకరించారు. స్వామివారి సేవలో భాగంగా భక్తులు ఈ పవిత్ర కానుకను ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానానికి విలువైన శతగోపాలను అందించిన దాతల సేవను ఆలయ అధికారులు గ్రామ ప్రజలు మరియు భక్తులు అభినందించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటరెడ్డి,ఆలయ అర్చకులు చక్రవర్తుల కళ్యాణ సుందరాచార్యులు ఆలయ సిబ్బంది మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రేణుకుంట్ల మల్లక్క మృతికి " గజ్జి శంకర్ " కన్నీటి నివాళి..

జనం వాయిస్, శాయంపేట, అక్టోబర్ 15:

శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన దివ్యాంగురాలు రేణుకుంట్ల మల్లక్క గుండె జబ్బుతో మృతి చెందడం బాధాకరమని తల్లి దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గజ్జి శంకర్ విచారం వ్యక్తం చేశారు. మల్లక్క మృతి విషయం తెలుసుకున్న ఆయన వెంటనే ఆమె నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లక్క ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట సమితి మండల అధ్యక్షుడు ఎర్ర తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు మంద రాజు, ప్రధాన కార్యదర్శి తడక సంతోష్ గౌడ్, గ్రామ అధ్యక్షుడు అబ్బు తిరుపతిరెడ్డి, ఇన్‌ఛార్జి అధ్యక్షుడు శంకర్ లింగం, కోగిల శ్రీకాంత్, చింతల రమేష్ తదితరులు ఉన్నారు.



సరస్వతి దేవి అలంకరణలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో అమ్మవారి దర్శనం

జనం వాయిస్, మందమర్రి: అక్టోబర్ 16

మందమర్రి మార్కెట్‌లోని శ్రీ శ్రీ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరవ రోజు శ్రీ సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులతో ప్రత్యేక సరస్వతి దేవి పూజా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు జ్ఞానం, విద్యాబుద్ధులు, ఏకాగ్రత, సద్బుద్ధి ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తిమయ వాతావరణంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



రావణ వధకు ముస్తాబవుతున్న "సామల" గ్రౌండ్

జనం వాయిస్,శాయంపేట, అక్టోబర్ 16:

శాయంపేటలో రావణ వధ ఉత్సవాల సందడి మొదలైంది.ఈ నెల 20న నిర్వహించనున్న వేడుకలకు సామల గ్రౌండ్‌ను సిద్ధం చేసే పనుల్లో గ్రామ సర్పంచ్ చింతల ఉమా-రవిపాల్,ఉప సర్పంచ్ దైనంపల్లి సుమన్ నిమగ్నమయ్యారు. రావణ వధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాక్టర్‌డోజర్ సహాయంతో గ్రౌండ్‌ను చదును చేయించారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు అనువుగా మైదానాన్ని తీర్చిదిద్దుతున్నారు.గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనేలా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు చిందం సాయి,మత్స్యగిరి ఆలయ చైర్మన్ సామల భిక్షపతి,వార్డు సభ్యులు చెల్కూరి బంటి,మార్త ప్రవళిక-సాయి,బాసాని వినయ్,వినీత్, తట్ల సాయి,మోరె సందీప్ పాల్గొన్నారు.



ఏలూరి కృష్ణమూర్తిని పరామర్శించిన: మాజీ మంత్రి ఎర్రబెల్లి.



అక్టోబర్ 16 జనం వాయిస్ పాలకుర్తి:

పాలకుర్తి మండలం: శాతపురం గ్రామానికి చెందిన, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలూరి కృష్ణమూర్తి అనారోగ్యం కారణంగా శాస్త్ర చికిత్స చేసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, వారిని పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా నాయకులు ఐలేని సుధాకర్ రెడ్డి, పార్టీ నాయకులు పశులాది పోశయ్య, వార్డు సభ్యులు ఆనగంటి వెంకటేశ్వర్లు, బొందుగుల విజయ్ , గన్న కృష్ణమూర్తి, వల్లపు యాదగిరి, ఐలేని యాకం రెడ్డి, బీరెల్లి రవివర్మ, పసులాది రాజు, తోడేటి చిన్న యాకయ్య, వట్టిపల్లి శ్రీశైలం,బీరెల్లి, ముత్తయ్య, వెంకన్న, యువ నాయకులు ఐలేని శ్రవణ్ రెడ్డి, పసులాది ఉపేందర్, పశులది మహేష్, తదితరులున్నారు...

ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పాలకుర్తి, దేవరుప్పుల నూతన ఎస్ఐలు.





అక్టోబర్ 16 జనం వాయిస్ పాలకుర్తి:

పాలకుర్తి మండల నూతన ఎస్ఐగా ఊర సృజన్ కుమార్, దేవరుప్పుల మండల నూతన ఎస్ఐగా చింత రాజు బాధ్యతలు స్వీకరించిన అనంతరం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో వారు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

PRGI NO:TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

జనగామ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కాంగ్రెస్ పాండు కృష్ణ కూతుళ్ల సారి వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.

అక్టోబర్ 16 జనం వాయిస్ పాలకుర్తి

దేవరుప్పుల జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తోటకూరి పాండు కృష్ణ కుమార్తెల సారి వేడుక దేవరుప్పుల మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో నిర్వహించారు. ఈ వేడుకకు పాలకుర్తి శాసన సభ్యురాలుమామిడాల యశస్విని రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆశీర్వాదాలు తెలియజేస్తూ, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమమే లక్ష్యం

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డా. కావటి సతీష్ యాదవ్.
- మంథని మండల తెలంగాణ ఉద్యమకారుల సంఘం కమిటీ ఎన్నిక.

జనం వాయిస్, మంథని, అక్టోబర్ 16:

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడికి గుర్తింపు, గౌరవంతో పాటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డా. కావటి సతీష్ యాదవ్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్ డా. పిడమర్తి రవి ఆదేశాల మేరకు శుక్రవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మంథని మండల నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం డా. పిడమర్తి రవి నాయకత్వంలో ఏళ్లుగా పోరాటం కొనసాగిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేకే కమిటీని ఏర్పాటు చేసి, ఉద్యమకారుల గుర్తింపు కోసం ఆన్‌లైన్ దరఖాస్తులకు జీవో జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉద్యమకారులంతా తమ ఫోటోలు, పత్రికల్లో ప్రచురితమైన వార్తల కటింగులు, ఉద్యమంలో పాల్గొన్నట్లు నిరూపించే ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మంథని మండల కమిటీ అధ్యక్షుడిగా మిర్యాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా సాదుల శ్రీనివాస్, కోరవేన కుమార్, ఉపాధ్యక్షులుగా ముస్కె ఈశ్వరమ్మ, జిమ్మడ కొండయ్య, అరెల్లి సురేందర్, కార్యదర్శులుగా ఆకుల అరుణ, కాసిపేట మల్లేష్, సంయుక్త కార్యదర్శులుగా అక్కపాక లక్ష్మి, ముత్తినేని నరేష్, ప్రచార కార్యదర్శులుగా కట్టెకోళ్ల విజయ్, దాడి శ్రీనివాస్, కోశాధికారిగా చిదురాల మధుకర్ రెడ్డి, మీడియా ఇన్‌చార్జిగా ఎస్.కె. ముజీబ్, కార్యవర్గ సభ్యులుగా దాసరి శంకర్, తొర్తి శివ, కొండి సాగర్‌లను నియమించినట్లు ప్రకటించారు. ఉద్యమకారుల హక్కుల సాధనకు నూతన కమిటీ సభ్యులంతా ఐక్యంగా కృషి చేయాలని డా. కావటి సతీష్ యాదవ్ పిలుపునిచ్చారు.



పారా త్రోబాల్ క్రీడాకారిణికి ఆర్థిక ప్రోత్సాహకం

- కావేరి జ్యోతికి రూ.10,016 అందజేసిన ఎంఆర్ గ్రూప్స్ ప్రతినిధులు.
- అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి: డా. కౌటం ఉదయ్ కిరణ్, కృష్ణ కౌశిక్.

జనం వాయిస్, మంథని, అక్టోబర్ 16:

పలిమెల మండలానికి చెందిన ప్రతిభావంతురాలైన క్రీడాకారిణి కావేరి జ్యోతికి ఎంఆర్ గ్రూప్స్ ఆధ్వర్యంలో ఆర్థిక ప్రోత్సాహకం అందజేశారు. నవంబర్ 2026లో జరగనున్న రెండో సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు కావేరి జ్యోతి ఎంపికైన సందర్భంగా ఆమెను ప్రోత్సహించేందుకు ఎంఆర్ గ్రూప్స్ తరఫున డా. కౌటం ఉదయ్ కిరణ్, కృష్ణ కౌశిక్ కలిసి రూ.10,016 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన కావేరి జ్యోతి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా వారు మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కావేరి జ్యోతి భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



నాయకపోడు సేవా సంఘం మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మండల అధ్యక్షుడిగా సంకుర్తుల ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా పోలం చిరంజీవి.





జనం వాయిస్, ముత్తారం, అక్టోబర్ 16:

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల నాయకపోడు సేవా సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధి సందరెల్లి సమ్మక్క--సారలమ్మ దేవాలయ ప్రాంగణంలో కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలం మల్లేష్, జిల్లా అధ్యక్షుడు కోలాకాని సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి గడ్డం పోశం, పర్కింగ్ ప్రెసిడెంట్ పోలం అశోక్, ఉపాధ్యక్షులు కోట భీమయ్య, పర్ర సాయిలు, గుండెపు సతీష్ హాజరయ్యారు. వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా సంకుర్తుల ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా పోలం చిరంజీవి, గౌరవ అధ్యక్షుడిగా గుర్రం కిష్టయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గుర్రం శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా పెద్ది రాజసమ్మయ్య, భీమిని గట్టయ్య, సంయుక్త కార్యదర్శులుగా పర్ర ఓదెలు, పెద్ది లక్ష్మీరాజ్యం, కోశాధికారిగా ముసలి అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. నాయకపోడు సామాజికవర్గ ఐక్యతకు, సంఘం అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకపోడు సేవా సంఘం కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఐటీయూలోకి యువ కార్మికుల భారీ చేరికలు

- కార్మిక హక్కుల సాధనే లక్ష్యంగా నిరంతర పోరాటం.
- సింగరేణి కార్మికులందరికీ సొంతింటి పథకం అమలు చేయాలి.
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డి.

జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 16:

సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఐటీయూ నిరంతరం పోరాడుతోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం రామగుండం-2 ఏరియా పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టుకు చెందిన పలువురు యువ కార్మికులు సీఐటీయూ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డి నూతనంగా చేరిన కార్మికులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు తలవంచకుండా కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ స్వతంత్రంగా పనిచేస్తోందన్నారు. సంఘం చేపడుతున్న పోరాటాలకు ఆకర్షితులై యువ కార్మికులు పెద్ద సంఖ్యలో చేరడం శుభపరిణామమన్నారు. సింగరేణి కార్మికులందరికీ సొంతింటి పథకం అమలయ్యే వరకు పోరాటాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సంస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ-3 పిట్ కార్యదర్శి రాంప్రసాద్, సహాయ కార్యదర్శి వినేష్, నాయకులు విజయకుమార్, శ్రీనివాస్, సుమన్, రాజశేఖర్, మల్లేశం, శ్యాంప్రసాద్‌తో పాటు నూతనంగా చేరిన కార్మికులు శ్రీకాంత్, కార్తీక్, ఎండీ యాకూబ్, వంశీ, ఎస్.కే. యాకూబ్, ఏ. మహేష్, శ్రవణ్, కే. మహేష్, మల్లయ్య, విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల్లో జాప్యం సహించేది లేదు

- నిర్దేశిత గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలి.
- జనవరి 15 నాటికి నూతన ఆసుపత్రి, ఫిబ్రవరిలోగా నర్సింగ్ కళాశాల భవనం పూర్తి కావాలి.
- అక్టోబర్ 25లోగా జీవో 76 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి.
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు.

జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 16:

రామగుండం నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం రామగుండం నగరంతో పాటు మంథని మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామగుండం--లింగాపూర్ రహదారి నిర్మాణానికి ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, నీటి పైపులైన్లను వెంటనే తరలించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు చేపట్టి రహదారి నిర్మాణంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. అనంతరం రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. జనవరి 15 నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి సంక్రాంతి సందర్భంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అదే ప్రాంగణంలో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల భవనాన్ని ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని సూచించారు. రామగుండం 36వ డివిజన్‌లో జీవో 76 కింద వచ్చిన దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత భూములు సింగరేణి సంస్థకు చెందినవా కాదా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అక్టోబర్ 25లోగా ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, స్పెషలిస్ట్ వైద్యుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ శస్త్రచికిత్సల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శారదానగర్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. విద్యాసంస్థల్లో చేపట్టిన మరమ్మతు పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. అనంతరం మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో గౌతమి మహిళా సమాఖ్య, రామగిరి మహిళా సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. రోజుకు 6 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఉండగా, ప్రత్యేక విద్యుత్ లైన్ లేకపోవడంతో ప్రస్తుతం సుమారు 4,500 యూనిట్లను గుంజపడుగు సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటుకు రూ.28 లక్షలు అవసరమవుతాయని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, పూర్తి వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. సోలార్ ప్లాంట్ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో టీజీఎంఎస్ఐడీసీ అధికారి విశ్వప్రసాద్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఏఈ రమేష్, ఈఈ రామకృష్ణ, అదనపు డీఆర్డీఏ అధికారి రవీందర్, డీఈ ప్రభాకర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





రామగుండం కమిషనరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 16:

రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక చొరవతో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వేడుకలు సందడిగా సాగాయి. మహిళా సిబ్బంది బతుకమ్మ పాటలు, ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా పండుగలు జరుపుకునేందుకు పోలీసులు రేయింబవళ్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సద్దుల బతుకమ్మ రోజున మహిళా పోలీసులు బందోబస్తు విధుల్లో ఉండాల్సి వస్తుందని, అందుకే వారు కుటుంబ సభ్యులతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకునేలా ముందుగానే వేడుకలు నిర్వహించినట్లు వివరించారు. విధి నిర్వహణతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం ఎంతో ముఖ్యమన్నారు.

